క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జనగామ రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క రూ ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులు గ్రామాల్లో తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంబర్తిలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

పార్టీ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ కార్యకర్తగా ఎల్లప్పుడు కట్టుబడి ఉంటానని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి అన్నారు. డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లందుల బాబు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు సింగపురం వెంకటయ్య, ఏలియా, వసంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షురాలిగా రాధిక ఎన్నిక

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త పోలు రాధికను గ్రామ శాఖ మహిళా అధ్యక్షురాలిగా శుక్రవారం నియమించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాలతో ఎనుకున్నట్లు పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్, మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, ఉపాధ్యక్షుడు కిరణ్ రెడ్డిలు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా యాదగిరి



తరిగొప్పుల: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పగలబోయిన యాదగిరిగౌడ్ నియమిస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామకపత్రాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి యాదగిరికి శుక్రవారం అందజేశారు.

'పూజారిగా అధికారులే నియమించారు'

చిల్పూరు: 2009 సంవత్సరంలోనే నష్కల్ రామలింగేశ్వరస్వామి (శివాలయం) పూజారిగా తనను దేవాదాయ శాఖ అధికారులే నియమించారని నిత్యపూజారి ఘణపురం నర్సయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని నష్కల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయానికి ఆకేరువాగు పక్కన ఎకరం 28 గుంటల భూమి ఉండేది. కౌలుకు తీసుకున్న వారు ఇచ్చే డబ్బులతో తమ తండ్రి వీరభద్రయ్య పండుగల సమయంలో ప్రతీ సోమవారం పూజలు చేసేవారు. తదుపరి వాగులోకి నీరు రావడంతో వ్యవసాయ భూమి అందులో మునిగిపోయింది. భక్తులు ఇచ్చే కానుకలతో తాను అర్చకుడిగా పూజలు చేస్తున్నానని తెలిపారు. ఆ సమయంలో దివంగత వైఎస్సార్ సీఎం అయ్యాక శివాలయాల్లో పూజలు చేస్తున్న అర్చకుకు రూ. 2500 గౌరవ వేతనంగా ఇచ్చేవారు. 2014లో కేసీఆర్ సీఎం రూ. 6 వేల నుంచి రూ. 10 వేలకు వరకు పెంచారన్నారు. ఇవి తనపేరు మీదనే దేవాదాయ శాఖ నుంచి వస్తుండగా వారసత్వ అర్చకుడిగా తనకు అవకాశం ఇవ్వాలని తన తమ్ముడు పరమేశ్వర శర్మ ఎలా అంటాడని అన్నారు.

మండల కమిటీలో గందరగోళం

లింగాలఘణపురం: మండలంలో బీజేపీ మండల అధ్యక్షున్ని నేనంటే నేనే అంటూ పోటాపోటీగా మండల కమిటీని ప్రకటించి గందరగోళం సృష్టించారు. గతంలో మండల అధ్యక్షుడిగా పని చేసిన గొరిగె సంపత్ స్థానంలో మాణిక్యాపురానికి చెందిన ప్రజ్ఞాపురం ఆంజనేయులును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీంతో ఆయన పూర్తిస్థాయి కమిటీని ఈ నెల 4న ప్రకటిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీంతో గతంలో పని చేసిన సంపత్ నేనే మండల అధ్యక్షునని శుక్రవారం పూర్తిస్థాయి మండల కమిటీ ఇదేనంటూ కొంతమంది పేర్లతో ప్రకటించారు. ఈ విషయంపై మండల అధ్యక్షుడు ఆంజనేయులును ప్రశ్నించగా జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి మండల అధ్యక్షుడిగా తనను ప్రకటించారన్నారు. ఆయన ఆదేశాల మేరకే పూర్తిస్థాయి మండల కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ విషయంపై సంపత్‌ను ప్రశ్నిస్తే రాష్ట్ర స్థాయిలో తననే మండల అధ్యక్షుడిగా కొనసాగాలని చెప్పాగత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి తమపై తప్పు డు ఫిర్యాదు చేశారని, ప్రస్తుతం తానే మండల అధ్యక్షునని, తన హోదాలో కమిటీని ప్రకటించానని తెలిపారు.



జఫర్‌గఢ్ : జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బచ్చన్నపేట : జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకుర్తి : జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ..



దేవరుప్పులలో..

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

దేశ మాజీ ఉపప్రధాని బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. 40 సంవత్సరాలు పార్లమెంటులో వివిధ మంత్రి పదవులు నిర్వహించి ఉప ప్రధానిగా కొనసాగారని అన్నారు. ఆయన సాధన కోసం ప్రతి దళితుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ప్రజలంతా రాజకీయంగా ఎదగాలని సూచించారు. జనగామ జిల్లా కేంద్రం, జనగామ, రఘునాథపల్లి, కొడకండ్ల, బచ్చన్నపేట, జఫర్‌గఢ్, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, తరిగొప్పుల, లింగాలఘణపురం, నర్మెట, దేవరుప్పుల మండల కేంద్రాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జనగామ : జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నర్మెట : వెల్దండలో కేక్ చేస్తున్న నేతలు



రఘునాథపల్లి : ఖిలాషాపూర్‌లో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొమురయ్య



జనగామ రూరల్ : అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..



కొడకండ్ల : బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సురేష్‌నాయక్



స్టేషన్‌ఘన్‌పూర్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



లింగాలఘణపురం : నెల్లుట్లలో ..



తరిగొప్పులలో..

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బచ్చన్నపేట : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలని ఐకేపీ సీసీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యంను మంచిగా తమ బావుల వద్దనే ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవాలు



దేవరుప్పుల : మండలంలోని రామచంద్రాపురంలో దుర్గామాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాలకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు వేర్వేరుగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ దామెర రమ, మాజీ సర్పంచ్‌లు బక్కమ్మ, రవి, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, రెడ్డిరాజుల రమేష్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ పాము మోహన్, మైస్సారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

బచ్చన్నపేట : తాడిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పోచన్నపేటలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. నర్మెట చిన్నసత్తయ్య తాడిచెట్టు ఎక్కి కల్లుతీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి సత్తయ్యను జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకొనిపోవాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బచ్చన్నపేట: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర నాయకులు



కొడకండ్ల: కనకయ్యను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

బచ్చన్నపేట : మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల సంతోష్‌రెడ్డి తండ్రి చెంద్రారెడ్డి మృతి చెందగా పలువురు నాయకులు పరామర్శించారు. శుక్రవారం ద్వాదశ దినకర్మ సందర్భంగా వారి కుటుంబాన్ని, మృతుడి కుమారులు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డిలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పలు పార్టీల రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, ప్రవీణ్, సుందర్‌రెడ్డి, నర్సింగారావు, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొడకండ్ల : ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగిన మొండ్రాయి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బొబ్బిలి కనకయ్య యాదవ్‌ను శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, వెంకటేశ్వర్‌రావు, సతీష్‌గౌడ్ ఉన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన నలిమెల లచ్చమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామవాసి, బీఆర్‌ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు నారగోని రవిచంద్ర మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట స్వామి, శేఖర్, ప్రమోద్, ప్రణయ్ ఉన్నారు.

దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు బత్తిని రాజు అకాల మరణం పొందగా ఆ కుటుంబాన్ని పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరికల రతన్, సీనియర్ నాయకులు బస్వ సోమయ్య, రెడ్డి రాజుల రమేష్, శ్రీనివాస్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్‌కుమార్, చల్మారెడ్డి, ఉపేందర్, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



జనగామ: వాసవి క్లబ్ గ్రేటర్, వాసవి క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు పడకంటి రవీందర్ జన్మదినం పురస్కరించుకుని రైల్వేస్టేషన్ ఆవరణలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్ కుటుంబాల్లో ఏ శుభకార్యం జరిగినా, సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐపీసీ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, జోన్ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, మాధంశెట్టి వరూధిని, గంగిశెట్టి అనూజ, నాగమణి, సంతోష్, రాధాకృష్ణ, ఉపేందర్, రజిత పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

నర్మెట: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.శరత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించబడే పరీక్షల్లో 6వ తరగతికి ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు, 7వ తరగతికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

మాకూ సన్నబియ్యం ఇవ్వాలి



రేషన్ షాపులో నిరసన తెలుపుతున్న కార్డుదారులు

చిల్పూరు : గ్రామంలో రెండు రేషన్‌షాపులుండగా ఒకషాపుకు సన్నబియ్యం, మరో షాపుకు దొడ్డు బియ్యం పంపారని మేము తీసుకునే షాపుకు కూడా సన్నబియ్యం పంపాలంటూ కార్డుదారులు నిరసన తెలిపిన సంఘటన మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం చోటు చేసుకుంది. పల్లగుట్టలో షాపు నంబర్–1 డీలర్ కొయ్యడ రాంచందర్, షాపు–2 డీలర్ కదారి జయపాల్‌రెడ్డికి ఉన్నాయి. ఈ నెల గోదాంల నుంచి లారీల ద్వారా బియ్యం ఈ రెండు షాపుల్లో వేశారు. అందులో రాంచందర్ షాపులో సగం సన్నవి, సగం దొడ్డువి వేసి జయపాల్‌రెడ్డికి మొత్తం దొడ్డు బియ్యం వేశారు. ఉదయం చాలా మంది రెండు షాపుల్లో ఉచిత బియ్యం తీసుకున్నారు. కాగా 1వ నంబర్ షాపులో ఒక్కో కార్డుదారుడికి సగం సన్నవి, సగం దొడ్డువి ఇవ్వగా, 2వ నంబర్ షాపులో పూర్తిగా దొడ్డువి ఇవ్వడంతో బియ్యం తీసుకున్నవారితో పాటు తీసుకోడానికి వచ్చిన కార్డుదారులు మాకు అలాగే ఇవ్వాలంటూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా డీలర్ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయంపై గోదాం ఇన్‌చార్జ్ ఆంజనేయులుకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తనకు తెలియదని సమాధానం చెప్పాడు. రేషన్ షాపులకు బియ్యం తరలించేందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని కవిత ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఇలా చేస్తుందని తెలిపాడు. గతంలో ఇలాగే చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోవడంతో కక్ష కట్టారని తెలిపాడు. అధికారులు స్పందించి రెండు షాపులకు ఒకే రకం బియ్యం అందజేయాలని కోరారు.

పెళ్లిలో కెమెరాల చోరీ

- రూ.4.50లక్షల విలువ చేసే ఫొటోగ్రాఫర్ల కెమెరాలు మాయం

జనగామ: వివాహ వేడుకల్లో ఫొటోగ్రాఫర్లు పెళ్లి తంతును షూట్ చేసే పనిలో నిమగ్నం కాగా.. చుట్టపుచూపుగా వచ్చినట్లు యాక్టింగ్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు కెమెరాలు, డ్రోన్లను ఎత్తుకెళ్లిన సంఘటన గురువారం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జనగామ పట్టణంతోపాటు మండలంలోని పెంబర్తి గ్రామ శివారులో ఉన్న సాయిరాం, పెంబర్తి బీఎంఆర్, శివం గార్డెన్‌లో మూడు పెళ్లిళ్లు జరిగాయి. వివాహ మహోత్సవ వేడుకలను తమ కెమెరాల్లో బంధించేందుకు ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. ఫొటోగ్రాఫర్లు, పెళ్లి తరుపు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పెళ్లి కార్యక్రమాన్ని తిలకిస్తున్న సమయంలో ఇందులో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు రూ.4.50లక్షల విలువ చేసే కెమెరాలు, డ్రోన్‌లను అపహరించుకుపోయారు. పెంబర్తి బీఎంఆర్ గార్డెన్‌లో జనగామ ఫొటో గ్రాఫర్ అక్షయ్‌కు చెందిన రూ.20వేల విలువ చేసే కెమెరా లెన్స్, పట్టణంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో ఆలేరుకు చెందిన ఫొటో గ్రాఫర్ రాయపురం శ్రీనివాస్‌కు చెందిన రూ.1.80లక్షల విలువ చేసే డ్రోన్, పెంబర్తిలోని శివం గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ కొంగరి పర్శరాములకు చెందిన రూ.2.50 లక్షల విలు చేసే 5డీ కెమెరా సెట్ చోరీకి గురైంది. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పెళ్లి సందడిలో అపహరణకు గురైన డ్రోన్ కెమెరా ఎత్తుకెళ్లిన వ్యక్తులను సీసీ పుటేజీల ద్వారా గుర్తించగా ఇక్కడ కూడా ఆ వ్యక్తి దొంగతనం చేసి ఉంటారని ఫొటోగ్రాఫర్లు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

కేసు నమోదు

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారి సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.చెన్నకేశవులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నారపల్లికి చెందిన గ్యార సాయి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు సాయితో పాటు ఎనిమిది మంది కలిసి అతని స్నేహితుడు వివాహానికి కారులో సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఉండగా వెళ్లి తిరుగు ప్రయాణం వస్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ దగ్గర డ్రైవర్ ప్రవీణ్ వాహనం అతివేగంగా నడుపుతూ ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టగా రెండు వాహనాల్లో ఉన్న వారికి గాయాలు కాగా వీరిలో సాయి మృతి చెందాడన్నారు. డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనట్లు వివరించారు.

సంక్షిప్త సమాచారం

అస్పత్రిలో పండ్ల పంపిణీ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్ సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఫౌండర్ డాక్టర్ పాల్సన్ రాజు జన్మదినం సందర్భంగా శుక్రవారం జిల్లా అస్పత్రిలో రోగులకు పండ్లు , బ్రెడ్‌లు పంపిణీ చేశారు. డాక్టర్ మాచర్ల భిక్షపతి పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చర్చిలో చీరలు..

చిల్పూరు: డాక్టర్ పాల్సన్ రాజు పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని చిన్నపెండ్యాలలోని జీపీహెచ్ ప్రార్థనా మందిరంలో శుక్రవారం వృద్ధ, వితంతువులకు సంఘం పెద్ద చుక్క లింగయ్య చీరలు పంపిణీ చేశారు.

సన్మానం

బచ్చన్నపేట : కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన నూకల బాల్‌రెడ్డిని కిసాన్ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ శాలువాతో సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలో సన్మానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మండల ఇన్‌చార్జ్‌గా నియమించి నేడు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ మండల అధ్యక్షుడిగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఘనంగా పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

తరిగొప్పుల: మండలకేంద్రంలోని శ్రీభక్తాంజనేయ, శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా సాగాయి. రెండో రోజులో భాగంగా వేదపండితు ల మంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విరాళం అందజేత



తరిగొప్పుల: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గ మాత ఆలయ నిర్మాణానికి తమవంతుగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూ.50116 విరాళాన్ని కమిటీ బాధ్యులు ఎంపీటీసీ అర్జుల మధుసూదన్ రెడ్డికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల బాధ్యులు భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, సుధాకర్, రాజు, శ్రీనివాస్, రాజేందర్, మల్లికార్జున్, ఉషాకిరణ్, సత్తయ్య, శివకుమార్, నాగబండి శంకర్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే చర్యలు

లింగాలఘణపురం: గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చింత రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని జీడికల్‌లో మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై దాడి చేసి మద్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉందని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

108లో సాధారణ ప్రసవాలు

జనగామ రూరల్: 108 వాహనంలో శుక్రవారం ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు జరిగాయి. లింగాలఘణపురం మండలంలోని నేలపోగులకు చెందిన సూనె ఉమా ఉదయం పురిటి నొప్పులు రావడంతో వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా అక్కడ నుంచి జనగామలోని ఎంసీహెచ్‌కు తీసుకొస్తుండగా మార్గమధ్యలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే సిబ్బంది బిల్లా రాజు, పైలెట్ రమేష్ సహకారంతో అత్యవసర చికిత్స అందించారని దీంతో సుఖప్రసవం అయిందని బంధువులు తెలిపారు. అలాగే నర్మెట మండంలోని హన్మంతాపూర్‌కు చెందిన శిరీషకు పురిటి నొప్పులు రాగా 108 వాహనానికి సమాచారం అందించగా సిబ్బంది కల్యాణి, రాకేష్ సహకారంతో సాధారణ ప్రసవమైంది.

రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం

రఘునాథపల్లి: భారంగా మారిన బీజేపీ పాలన నుంచి విముక్తి పొందేందుకు ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌ను ప్రధానిని చేయాలనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలు నడుం బిగించారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. నేడు తుక్కుగూడలో జరిగే జనజాతర బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



లింగాలఘణపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సీట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం చేశారని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ –సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పార్టీని నమ్ముకొన్న మాదిగ నాయకుల రాజకీయ భవిష్యత్‌ను సమాధి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు ఉపేందర్, నల్ల స్వామి, యాదగిరి, కుమార్, అంజయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైక్

ఇద్దరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: రాంగ్‌రూట్‌లో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన రామంచ జాషువా, బాబు గాయపడిన సంఘటన మండలంలోని రాఘవాపూర్‌లో బస్టాండ్ సమీపాన శుక్రవారం సాయంత్రం జరిగింది. వరంగల్‌కు చెందిన సమీప బంధువులైన జాషువా, బాబు వ్యక్తిగత పనులపై బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మండలంలోని రాఘవాపూర్ బస్టాండ్ సమీపాన జాతీయ రహదారిపై డీసీఎం వ్యాన్ రాంగ్‌రూట్‌లో ఎదురుగా రాగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న జాషువా తీవ్రంగా గాయపడ్డాడు. బాబు తలకు, చేతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని ప్రథమ చికిత్స చేసి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా జాషువా పరిస్థితి విషమంగా ఉంది.